క్లుప్తంగా

స్వర్ణాంధ్ర ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీ


కళ్లజోళ్లు అందజేస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: పరమహంస యోగానంద నేత్రాలయ సౌజన్యంతో స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో గుర్తించిన వారికి మంగళవారం స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ, సుమారు 90 మందికి రూ.25 వేల విలువైన కళ్లజోళ్లను ఉచితంగా అందజేసినట్లు వివరించారు. తమ సంస్థ గత 27 ఏళ్లుగా వెయ్యికి పైగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్టు తెలిపారు. ఉచితంగా వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, కంటి ఆపరేషన్లు, కళ్లజోళ్ల పంపిణీ వంటివి చేపట్టామన్నారు. దాతలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు హరికృష్ణ, కొండలరావు, హరిప్రసాద్, మీరాకుమారి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని వినతి


మంత్రిని కలిసిన జగ్గారావు తదితరులు

సీటీఆర్ఐ: తమకు పని భారం తగ్గించాలని వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్స్ కార్యదర్శులు మంగళవారం వెలగపూడిలోని ఏపీ సెక్రటేరియట్ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణకు వినతిపత్రం అందించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఏపీ వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్స్ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల జగ్గారావు మాట్లాడుతూ, ప్లానింగ్ కార్యదర్శులకు పనిభారం చాలా ఎక్కువగా ఉంటోందన్నారు. పని ఒత్తిడి వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అన్ని పనులు కార్యదర్శులతోనే చేయిస్తున్నారన్నారు. తమకు పనిభారం తగ్గించి, పదోన్నతులు ఇవ్వాలని కోరారు. సంఘ రాష్ట్ర సహ అధ్యక్షుడు పిల్లి హరీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంజరవికుమార్ ఉన్నారు.

సమస్యలను ఎంపీ పరిష్కరించాలి

కడియం: మండల కేంద్రమైన కడియంలో నెలకొన్న సమస్యలను రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరి దృష్టి పెట్టి పరిష్కరించాలని బీజేపీ నాయకులు, స్థానిక రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కడియం ఆవలో రైతులకు తాగునీటి ఇబ్బందులు ఉన్నాయన్నారు. రైతుల కోసం నిర్మించిన పైపులు, షెడ్లు మరమ్మతులకు గురై, పనికి రాకుండా పోయాయన్నారు. అలాగే ఆవలో ముంపు సమస్యను పరిష్కరించడానికి చెక్‌డ్యామ్‌లు నిర్మించాల్సి ఉందన్నారు. అలాగే బొబ్బిలి బ్రిడ్జి సెంటర్‌లో మరో బ్రిడ్జిని నిర్మించాల్సి ఉందన్నారు. మండల కేంద్రమైన కడియం వాసులు ఎదుర్కొంటున్న ఆయా సమస్యలపై ఎంపీ ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు. స్థానిక నాయకులు చిక్కాల ఈశ్వరరావు, గారపాటి తాతబ్బాయి, చిక్కాల శ్రీను, సీహెచ్ రామచంద్రరావు, మంచిన దుర్గారావు పాల్గొన్నారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని వెంకటగిరిలో లెనోరా డెంటల్ కాలేజీ, నల్లమిల్లి రామకామేశ్వరరావు చారిటబుల్ ట్రస్టు సహకారంతో బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరుటూరి శ్రీనివాసరావు ఇంటి వద్ద శిబిరం జరుగుతుంది. హుకుంపేట, పిడింగొయ్యి గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు చైర్మన్ ఓ ప్రకటనలో కోరారు.

క్వారీ గోతుల్లో మృతదేహం

కంబాలచెరువు: స్థానిక క్వారీ గోతుల్లో కుళ్లిపోయిన మృతదేహాన్ని మూడో పట్టణ పోలీసులు మంగళవారం కనుగొన్నారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్లుంటాయి. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసులకు పరస్పర ఫిర్యాదులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): వైద్యుని నిర్లక్ష్యంతో ఓ మహిళ కంటిచూపు కోల్పోయిందన్న ఘటనపై ఇరువర్గాల వారు పోలీసులను ఆశ్రయించారు. స్థానిక దేవీచౌక్ సమీపంలోని ఓ ఆస్పత్రిలో సోమవారం జరిగిన ఈ సంఘటన నేపథ్యంలో, ఆస్పత్రి వద్ద తాము శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే పోలీసులతో చెదరగొట్టించారని బాధిత మహిళ కుమారుడు బి.దుర్గాప్రసాద్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా ఆస్పత్రి యాజమాన్యం కూడా ఆందోళనకారులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంకా కేసులు నమోదు కాలేదు.

కొండంత అండ

- నిరాశ్రయులకు సత్య చారిటబుల్ ట్రస్ట్ బాసట
- 700 మంది సభ్యులతో కార్యకలాపాలు
- రెండేళ్లలో 140కి పైగా సేవా కార్యక్రమాలు
- పేద విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన
- పర్యావరణ పరిరక్షణకు క్లాత్ బ్యాగ్‌ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న రోగుల మొదలు, నిరాశ్రయులకు, అభాగ్యులకు కొండంత అండగా నిలుస్తోంది మోరంపూడిలోని సత్య చారిటబుల్ ట్రస్టు. 700 మంది సభ్యులతో విద్య, వైద్య, వృద్ధులు, అనాథలు, పర్యావరణం అంశాల్లో 140కి పైగా సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలుస్తోందీ ట్రస్టు. సత్యచారిటబుల్ ట్రస్టు అనే స్వచ్ఛంద సేవా సంస్థ 2022 సెప్టెంబర్ పదో తేదీన ఆవిర్భవించింది. ప్రియదర్శిని చెవిటి, మూగ ఆశ్రమ పాఠశాలలో 150 మంది పిల్లలకు భోజనాలు పెట్టేందుకు మోరంపూడికి చెందిన తమ్మారవి తన తండ్రి సత్యనారాయణ పేరున సంస్థను స్నేహితులతో కలిసి ప్రారంభించారు. ఇలా సంస్థలో 700 మంది సభ్యులతో సేవా కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు.

మహిళకు చేయూత

మోరంపూడి దుర్గగుడి ఎదురుగా పేదరికం, అనారోగ్యంతో బాధపడుతున్న పిసిని శ్రీదేవి అనే మహిళ ఇద్దరు పిల్లలు, వృద్ధాప్యంలో ఉన్న తల్లితో ఉంటోంది. ఇది తెలిసిన ట్రస్టు బృందం శ్రీదేవి ఇంటిని చూసి చలించిపోయారు. దీంతో ఆమెకు నిత్యావసర సరకులు, బియ్యం అందజేశారు. అంతేకాకుండా ఇంటిపై ఎటువంటి కప్పు లేకపోవడం, మొండి గోడలుండడం చూసి, వెంటనే ఇంటిపై సిమెంటు రేకులు వేయించారు. ఈ నెల ఒకటో తేదీన శ్రీదేవికి ఈ ఇంటిని ట్రస్టు సభ్యులు అప్పగించారు. ట్రస్టు ద్వారా 140కి పైగా సేవా కార్యక్రమాలు చేపట్టారు.


పిసిని శ్రీదేవి ఇల్లు (షెడ్డు వేయక ముందు)


రేకుల షెడ్డు వేశాక


శ్రీదేవి ఇంటి వద్ద ట్రస్టు సభ్యులు

ట్రస్టు సేవా కార్యక్రమాలివే..

- ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఫీజులు, పుస్తకాలు, స్కూలు బ్యాగుల పంపిణీ.
- అనారోగ్యం బారిన పడి ఇబ్బంది పడుతున్న పేదలను హాస్పిటల్లో చూపించి, టెస్టులు చేయించి, మందులు ఉచితంగా ఇవ్వడం.
- పేదలు నివసించే కాలనీల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఉచితంగా టెస్టులు చేసి, మందులు, టానిక్స్ పంపిణీ.
- వృద్ధాశ్రమాల్లో, అనాథాశ్రమాల్లో, అంధ, చెవిటి, మూగ పిల్లల, మానసిక వికలాంగుల ఆశ్రమాల్లో సభ్యులకు ప్రతి వారం భోజనాల ఏర్పాటు, మందులు ఇవ్వడం, దుప్పట్ల పంపిణీ, పండ్లు పంపిణీ వంటి కార్యక్రమాలు.
- పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు ఉచితంగా పంచడం, వీధులను దత్తత తీసుకుని, మొక్కలను నాటి, సంరక్షించడం, పాలిథీన్ బ్యాగులను నిషేధించాలని కోరుతూ రైతు బజార్ల వద్ద క్లాత్ బ్యాగులను పంచడం, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించడం.
- పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వ స్కూల్ పిల్లలకు ప్రతి నెలా విద్యా నిపుణులతో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలను నిర్వహించడం.
- చిన్న వయసు నుంచి పిల్లలకు సాయం చేయడం, దానం చేయడంలో ఉన్న ఆనందాన్ని తెలియజెప్పి, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన కార్యక్రమం 'జాయ్ ఆఫ్ గివింగ్' ద్వారా స్కూల్ స్టూడెంట్ల ద్వారా అందే స్నాక్స్, టిఫిన్స్లు, పండ్లు, బిస్కట్లు వంటివి కూడా వృద్ధాశ్రమాలకు, అనాథాశ్రమాలకు, చెవిటి, మూగ పిల్లల ఆశ్రమాలకు, అంధుల ఆశ్రమాలకు ట్రస్ట్ ప్రతినిధులు అందిస్తున్నారు.

అందరి సహకారంతోనే..



తల్లిదండ్రులు ప్రోత్సాహం, మిత్రులు, భార్యాపిల్లల సహకారంతో సత్య చారిటబుల్ ట్రస్టు ద్వారా విజయవంతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. మా తండ్రి సత్యనారాయణ పేరున ఈ ట్రస్టును స్థాపించాం. మానవత సేవా సంస్థలో సభ్యుడిగా, మృతదేహాలకు అంత్యక్రియల్లో సేవలందించాం. ఎంతో మంది పేదలు, వృద్ధులు, అనాథలు, తిండి లేక, వైద్యం అందక ఇబ్బందులు పడుతుంటారని, అటువంటి వారికి సాయం చేయాలన్న ఆలోచన అప్పుడే వచ్చింది. దీంతో ట్రస్టును స్థాపించి ఎగ్జిక్యూటివ్ కమిటీ, ట్రస్టు సభ్యుల సహకారంతో 140కి పైగా సేవా కార్యక్రమాలు చేపట్టాం.

– తమ్మా రవి, వ్యవస్థాపక అధ్యక్షుడు, సత్య చారిటబుల్ ట్రస్టు, మోరంపూడి

ట్రస్టు సహకారం మరువలేనిది



స్కిన్ ఎలర్జీతో బాధపడుతున్న నాకు సత్య చారిటబుల్ ట్రస్టు ద్వారా వైద్య పరీక్షలు చేయించారు. మందులను ఉచితంగా అందజేశారు. స్కిన్ ఎలర్జీతో పనికి వెళ్లలేకపోవడంతో, మూడు నెలలకు సరిపడా కిరాణా సామగ్రి అందజేశారు. ఇప్పుడు ఆరోగ్యంగా ఉండడంతో పనికి కూడా వెళుతున్నాను. ట్రస్టు సభ్యుల సహకారం మరువలేనిది.

– కొమ్మారి వెంకటేశులు, హుకుంపేట

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల పరిశీలన


తహసీల్దార్ కుమార్‌కు సూచనలు ఇస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రికార్డుల నిర్వహణ, డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇటీవల గ్రామ రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన అర్జీల పరిష్కార స్థాయిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆర్వోఆర్ కోసం వచ్చిన అర్జీలను నూరు శాతం డేటా ఎంట్రీ చేసినట్లు తహసీల్దార్ పీవీవీజీఎస్ కుమార్ వివరించారు. రీ ఓపెన్ పీజీఆర్ఎస్ అర్జీలను జవాబుదారీతనం కలిగి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూకు సంబంధించని అర్జీలను ఆయా శాఖలకు పంపాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారి గ్రామ స్థాయికి చెందిన డేటా ఎంట్రీ నమోదు వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై పూర్తిగా ఆధారపడకుండా తహసీల్దార్ తనిఖీ చేయాలన్నారు. నీటి తీరువా, మండల పరిధిలో డెల్టా, మెట్ట గ్రామాలు, డేటా ఎంట్రీ ప్రక్రియ తదితర అంశాల ప్రగతిని ఆరా తీశారు. డిప్యూటీ తహసీల్దార్, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కడియం: వేమగిరి వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు కాలేజీ బస్సు ఢీకొని మృతి చెందిన విద్యార్థిని పితాని రూపాదేవి కుటుంబానికి సంబంధిత కాలేజీ యాజమాన్యం రూ.నాలుగు లక్షల ఆర్థిక సాయం అందజేసింది. ఈ మేరకు టీడీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, పితాని శివరామకృష్ణ ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు.

6 నుంచి సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు

- షణ్ముఖ పీఠంలో యాగాలు, హోమాలు
- పీఠాధిపతి స్కంద స్వామిజీ వెల్లడి

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు అఫీషియల్ కాలనీలో ఉన్న శ్రీచక్ర సహిత శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధి షణ్ముఖ పీఠంలో, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుబ్బారాయుడు షష్ఠి మహోత్సవాలు ఈ నెల 6 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి స్కంద స్వామిజీ తెలిపారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, హిందూ ధర్మానికి అనుగుణంగా సంప్రదాయ దుస్తులు ధరించి, కులమతాలకతీతంగా ప్రతిఒక్కరూ గర్భాలయంలోకి ప్రవేశించి, స్వామివారికి అభిషేకం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అభిషేకం పాలలో పటిక బెల్లం కల్పి తీర్థంగా ఇస్తామన్నారు. డాక్టర్లు, పోలీసు, రెవెన్యూ తదితర శాఖల ఉద్యోగులకు, వృద్ధులకు, దివ్యాంగులకు, చంటి పిల్లలతో వచ్చిన వారికి ప్రత్యేక దర్శనం ఉంటుందన్నారు. ధర్మానికి, సంప్రదాయానికి అనుగుణంగా, ఎలాంటి టికెట్లు పెట్టకుండా స్వామివారిని దర్శించుకునే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది విశేష కార్యక్రమాలుగా చండీ యాగం, లలితా యాగం వంటివి నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ నెల 6న ఉదయం 9 గంటలకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అలాగే 7న షష్ఠి సందర్భంగా ఉదయం 4 నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్షీరాభిషేకం, అనంతరం సంప్రోక్షణ ఉంటుందని తెలిపారు. 8న ఉదయం 7 గంటలకు స్వామివారికి పుష్కరాల రేవులో వేలాయు ధ స్నానం, అనంతరం108 కలశాల గోదావరి జలాలతో మూలవిరాట్‌కు అభిషేకం, సాయంత్రం 6 గంటలకు సాయి బృందం వారి నృత్య ప్రదర్శన ఉంటాయని వివరించారు. 9న ఉదయం 9 గంటలకు లక్ష్మీ యాగం, 10న ఉదయం 6 గంటలకు అభిషేకాలు, అనంతరం అలంకార సేవ, 11న ఉదయం 9 గంటల నుంచి స్వర్ణాకర్షణ భైరవ హోమం ఉంటాయని చెప్పారు. 12న ఉదయం 8:30కు బాలా, లలితా త్రిపుర సుందరి అమ్మవార్లకు హోమం, సాయంత్రం 5 గంటలకు సహస్ర దీపాలంకరణ, 13న ఉదయం 108 దంపతులతో' కృత్తికా నక్షత్ర మాస కల్యాణ మహోత్సవం 14న ఉదయం.9 గంటలకు దత్త జయంతి సందర్భంగా దత్త హోమం, 15న ఉదయం స్వామివారికి కావడి ఉత్సవం, సాయంత్రం 4 గంటలకు స్వామివారి నగర ఊరేగింపు, 16న ఉదయం రుద్ర హోమం జరుగుతాయని వివరించారు. 17న ఉదయం 6 గంటలకు అభిషేకం, అనంతరం స్వామివారికి అన్నాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.


కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్కంద స్వామిజీ తదితరులు

కాలుష్యంతోనే ప్రకృతి విపత్తులు

- ఏపీ పొల్యూషన్ బోర్డు మెంబర్ సురేఖ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): దేశంలో పెరిగిపోతున్న కాలుష్యం వల్లే అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయని ఏపీ పొల్యూషన్ బోర్డు మెంబర్ సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో విపరీత మార్పులకు కాలుష్యమే కారణమని, ఇప్పుడు మేలుకోకుంటే భవిష్యత్తులో తీవ్ర ముప్పు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో కాలుష్య నివారణ–చేపట్టాల్సిన పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలన్నారు.

విద్యార్థి దశ నుంచి కాలుష్యం, పంచభూతాలపై పూర్తి అవగాహన ఉండాలని, అవి కలుషితం కాకుండా చూడాలన్నారు. 1984లో భోపాల్ దుర్ఘటన నుంచి మానవజాతి నేర్చుకోవాల్సిన పాఠాలు చాలా ఉన్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణ మనతోనే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. వాతావరణ కాలుష్యాన్ని ప్రేరేపిస్తున్న వాహనాల వినియోగాన్ని తగ్గించాలన్నారు. అవసరం ఉన్నంత మేరకే వాహనాలు వాడాలన్నారు. పాఠశాల పరిశుభ్రత, నీటి పొదుపు, మంచి అలవాట్లు, ఉత్తమ వ్యక్తిత్వంతో విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, ఎస్‌కేవీటీ హైస్కూల్ హెచ్ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం, స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి పరసజగన్నాథరావు, సీఆర్ఎంటీ జయంతి శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సురేఖ

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

అల్కాట్‌తోట(రాజమహేంద్రవరం రూరల్): త్యాగరాజ నగర వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి 18వ ఆరాధన మహోత్సవాలు మంగళవారం స్థానిక గౌతమీ ఘాట్‌లోని సంఘ భవనం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్యాగ రాజస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నీరాజనాలర్పించారు. తొలుత సరస్వతీ ఘాట్ నుంచి వాయిద్య కళాకారులు ప్రదర్శనగా సంఘం వరకూ ర్యాలీ నిర్వహించారు. సభకు సంఘ నగర అధ్యక్షుడు రాలి పైడిరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, సంగీతానికి ప్రాణం పెట్టిన త్యాగరాజ స్వామి కీర్తనలు ఎల్లప్పుడూ సజీవంగా ఉంటాయన్నారు. కమ్యూనిటీ హాలు భవనం మరమ్మతులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, జీవనం ప్రసాదించిన వృత్తిని కాపాడుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం వాయిద్య కళాకారులకు ప్రభుత్వం తరఫున సాయం అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత వాయిద్య కళాకారుల సంగీత సమ్మేళనం జరిగింది. మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, యానాపు ఏసు, రాష్ట్ర నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

10న సీపీఐ జిల్లావ్యాప్త నిరసనలు

ప్రకాశం నగర్: అదానీ గ్రూప్ కంపెనీల అవినీతి తప్పిదాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు చేయాలని కోరుతూ ఈ నెల పదిన జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జట్లు సంఘం కార్యాలయములో జట్లు సంఘం అధ్యక్షుడు కె.రాంబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి మధు మాట్లాడుతూ, పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రాజమండ్రిలో భారీ ర్యాలీ ఉంటుందన్నారు. ప్రధాని మోదీ విధానాలతో దేశ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు వలంటీర్ల వేతనం రూ.10 వేలు ఇస్తామని చెప్పిన చంద్రాబాబు.. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వారందరినీ వెనక్కు పంపడం దారుణమన్నారు .దీనిపై పెద్దఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘ కార్యదర్శి సప్పా రమణ, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, నల్లా రామారావు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో నగర క్రీడాకారుల ప్రతిభ

ప్రకాశం నగర్: న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన ఆలిండియా నేషనల్ కరాటే ఇండియా ఆర్గనైజేషన్(కేఐఓ) ఫెడరేషన్ కప్ ప్రీమియర్ లీగ్, యూత్ లీగ్ మ్యాచ్‌లో నగరానికి చెందిన క్రీడాకారులు విశేష ప్రతిభ కనబర్చారని కరాటే మాస్టర్ పిల్లి అరుణ్‌కుమార్ మంగళవారం ఇక్కడ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు చెందిన పి.విజయ్ సిల్వర్ మెడల్ సాధించగా, లాస్లేట్ స్కూల్ విద్యార్థి కె.జాక్సన్, ధవళేశ్వరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎం.నవ్యశ్రీ, లాలాచెరువు మున్సిపల్ స్కూల్‌కు చెందిన పి.సత్యవెంకట శ్రీరామ్, శ్రీసునంద స్కూల్‌కు చెందిన పి.పూజ, కె.లక్ష్మీభవాని, వి.వెంకట కిరణ్మయి బ్రాంజ్ మెడల్లు సాధించారని వివరించారు.

దివ్యాంగుల్లో మనోధైర్యం కల్పించాలి

- డీఎస్ఈఓ వాసుదేవరావు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): సమాజంలో దివ్యాంగులపై చూపించే ప్రేమ, అభిమానం వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. మంగళవారం స్థానిక తాడితోట ఎస్వీఆర్ ప్రాథమిక పాఠశాలలోని భవిత ఉప కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాల పిల్లలకు సేవ చేయడం ఎంతో ఉత్తమ సేవ అన్నారు. దివ్యాంగులపై వివక్ష చూపడం నేరమన్నారు. ఉపాధ్యాయులు దివ్యాంగుల్లో ఉన్న ప్రతిభను ప్రోత్సహించాలన్నారు. అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్ మాట్లాడుతూ, ఎస్వీఆర్‌లో ఉన్న ఈ సెంటర్‌లో 39 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉన్నారన్నారు. హెచ్ఎం డేవిడ్ లివింగ్‌స్టన్ వీరిపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధను అభినందించారు. ఈ సందర్భంగా కేంద్రంలో సేవలందిస్తున్న సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రమారజిని, స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీ పరస జగన్నాథరావు, సీఆర్పీ జయంతి శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ధవళేశ్వరంలో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్‌బాబు


రాజమహేంద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రియదర్శిని విద్యార్థులు

ప్రియదర్శినిలో..

స్థానిక మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని పిల్లల ఆశ్రమంలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బధిర విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. క్రికెట్, కబడ్డీ, డ్రాయింగ్, అల్లికలు వంటి ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. చెవిటి, మూగ విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఏలూరుకు చెందిన డీఎస్పీ ఈవెంట్ రాజు చేసిన మ్యాజిక్ షో ఆకట్టుకుంది. ఆశ్రమ నిర్వాహకురాలు కె.స్వప్నవర్మ మాట్లాడుతూ, శారీరక లోపంతో పుట్టడమే కానీ, అందరికన్నా మిన్న అంటూ ప్రతిభ చూపుతున్నారన్నారు. వారిలో లోపాన్ని ఎత్తిచూపకుండా, ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రిన్సిపాల్ కె.ఆశాలత, ప్రేమలత, ఎలిషా రాజ్‌కుమార్, శాంతి, సునీత, ప్రియాంక పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

ధవళేశ్వరం: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక భవిత సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె ప్రకాష్‌బాబు పాల్గొన్నారు. విద్యార్థిని తేజ భరతనాట్యం ఆకట్టుకుంది. అనంతరం ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. రాజమహేంద్రవరం రూరల్ ఎంఈవో తులసీదాస్, ఎంఈవో–2 బి.కిరణ్‌చంద్ కుమార్, జిల్లా ఐఈ కో–ఆర్డినేటర్ కనకబాబు, ఎస్సై క్రాంతికుమార్, ఎంపీపీఎస్ హెచ్ఎం రామలక్ష్మి, కె వెంకటలక్ష్మి, భవిత సెంటర్ ఐఈఆర్పీలు విశ్వపతి, మణి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దివ్యాంగుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక కాటన్ బ్యారేజ్ వద్ద దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు యనమదల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు అంకం గంగరాజు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు యర్రా ఉమామహేశ్వరి, అధికార ప్రతినిధి గుత్తుల ఉమాదేవి, కర్రి మౌళి, మేడిద వెంకటరమణ, చిక్కాల వినోద్‌కుమార్, కొప్పిశెట్టి వరలక్ష్మి, కొక్కొరమట్ల రామకృష్ణ, కొండా చిన్నారి, గోపి, బి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కడియం: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని మురమండలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడపాటి పాపిరెడ్డి, బుజ్జి, వెంకటరమణ, అజిత్ హాజరయ్యారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు మెప్మా సత్కారం

సీటీఆర్ఐ: బ్యాంకు రుణాలు తీసుకుని, సక్రమంగా చెల్లించిన విభిన్న ప్రతిభావంతులైన చిరు వ్యాపారులను మెప్మా ఆధ్వర్యంలో సత్కరించారు. మంగళవారం స్థానిక సిద్దార్థనగర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మెప్మా సీఎంఎం రామలక్ష్మి మాట్లాడుతూ, అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో బ్యాంక్ రుణాలు తీసుకుని, వాటిని సక్రమంగా చెల్లించిన వారిని సత్కరించామన్నారు. అదేవిధంగా మూడు నూతన సంఘాలను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. రుణాల చెల్లింపుల విషయంలో ఆదర్శంగా నిలిచిన వీరిని సత్కరించుకోవడం తమ బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ సాయికుమార్, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.


విభిన్న ప్రతిభావంతులైన చిరు వ్యాపారులను సన్మానిస్తున్న మెప్మా సిబ్బంది